www.prajasakti.com
ప్రజాశక్తి
ఆదివారం 26 జనవరి 2025



ప్రజాస్వామ్యాన్ని కాపాడేది ఓటు హక్కే : కలెక్టర్


ర్యాలీ ప్రారంభిస్తున్న కలెక్టర్ శ్రీధర్

ప్రజాశక్తి-రాయచోటి : ప్రజాస్వామ్య విలువలను కాపాడేందుకు ఓటు హక్కే కీలకమని, ఓటు వేయడం పౌరుల హక్కు మాత్రమే కాదు బాధ్యత కూడా అని కలెక్టర్ శ్రీధర్ చామకూరి పేర్కొన్నారు. శనివారం జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా రాయచోటిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి కలెక్టర్ బంగ్లా వరకు నిర్వహించిన ఓటర్ల దినోత్సవ ర్యాలీలో కలెక్టర్ పాల్గొన్నారు. 1950 జనవరి 25న భారత దేశ ఎన్నికల సంఘం ఏర్పాటు చేసిన తేదీని జాతీయ ఓటర్ల దినోత్సవంగా జరుపుకుంటున్నామని, ప్రజాస్వామ్యానికి వెన్నెముకగా నిలిచే పౌరులందరి భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడం ఈ దినోత్సవ ముఖ్య లక్ష్యమన్నారు. ఈ సంవత్సరం 'ఓటు హక్కుకు సమానమైనది ఏదీ లేదు నేను ఖచ్చితంగా ఓటు వేస్తాను' అనే థీమ్‌తో జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని జరుపుకుంటున్నామని పేర్కొన్నారు. ర్యాలీలో పాల్గొన్న పౌరులతో భారతదేశ ఎన్నికల సంఘం రూపొందించిన ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో జెసి ఆదర్శ రాజేంద్రన్, డిఆర్ఓ మధుసూదన్‌రావు, అధికారులు, పాల్గొన్నారు.

బెడెడ్ పెన్షనర్లకు డేంజర్‌బెల్



- 54,129 మందికి రీఅసెస్మెంట్ పరీక్షలు
- రేపటి నుంచి ఇంటింటికీ వైద్య బృందాలు
- పొరుగు జిల్లాల నుంచి మానసిక వైద్య నిపుణులు రాక

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

బెడెడ్ పింఛనర్ల గుండెల్లో డేంజర్‌బెల్ మోగుతోంది. ఈ నెల 27 నుంచి కడప, అన్నమయ్య జిల్లాలకు చెందిన 54,129 మంది బెడెడ్ పింఛనుదారులకు రీ అసెస్మెంట్ పరీక్షలు నిర్వహణకు ప్రభుత్వం రంగం సిద్ధం చేసింది. మానసిక వైద్య వికలత్వ నిర్ధారణ పరీక్షల నిమిత్తం నెల్లూరు, అనంతపురం, మదనపల్లి ప్రాంతాలకు చెందిన మానసిక వైద్య నిపుణులు పరీక్షల నిర్వహణకు రప్పించనున్నారు. 2024 సార్వత్రిక ఎన్నికల ముగింట కడప, అన్నమయ్య జిల్లాల్లో బెడెడ్ పింఛన్లపై చెలరేగిన విమర్శల నేపథ్యం వెరిఫికేషన్‌కు కారణమని తెలుస్తోంది. కడప, అన్నమయ్య జిల్లాల్లో సుమారు 3,232 మంది పింఛనుదారులకు డిఆర్‌డిఎ అధికార యంత్రాంగాలు నోటీసులు జారీ చేసిన సంగతి తెలిసిందే. అనంతరం వైద్యబృందాలు వికలత్వ పరీక్షలను నిర్వహించాయి. సార్వత్రిక ఎన్నికలు ముగిసిన అనంతరం అధికారంలోకి వచ్చిన కూటమి సర్కారు పెన్షన్ల మొత్తాన్ని తగ్గించుకోవాలని భావించింది. రాష్ట్ర వ్యాప్తంగా బెడెడ్ రోగుల వికలత్వ శాతాన్ని రీఅసెస్మెంట్ చేయాలనే ఆలోచన చేసింది. ఆరుగురితో మంత్రుల బృందాన్ని నియమించింది. రాష్ట్ర వ్యాప్తంగా 16 లక్షల మంది బెడెడ్ పెన్షనర్స్ ఉన్నారని గుర్తించింది. వీరికి ప్రతి నెలా రూ.ఆరు వేల నుంచి రూ.10 వేల వరకు పెన్షన్ చెల్లిస్తోంది. బెడెడ్ పింఛనుదారుల్లోని వికలత్వశాతాన్ని రీఅసెస్మెంట్ చేయడం ద్వారా నిర్ధారించాలని నిర్ణయించింది. జోన్-7 పరిధిలోని కడప, అన్నమయ్య జిల్లాల్లో 54,129 మంది బెడెడ్ రోగులు ఉన్నట్లు గుర్తించింది. ఈ నెల 27 నుంచి హాస్పిటలైజ్ లోకో డాక్టర్ పేరుతో నడవలేని బెడెడ్ పింఛనుదారుల ఇంటికి వెళ్లి పరీక్షించనుంది. అంధులకు, బధిరులకు, మాసినక రోగులకు కడప జిజిహెచ్, పులివెందుల ఏరియా ఆస్పత్రి, ప్రొద్దుటూరు జిల్లా ఆస్పత్రి, బద్వేల్, మైదుకూరు, కమలాపురం సిహెచ్‌సి ఆస్పత్రులో వైద్య నిర్ధారణ పరీక్షలు నిర్వహణకు ఏర్పాట్లు చేస్తోంది. కడప జిల్లాలో నడవలేని పింఛనుదారులు 19,087 మంది, అన్నమయ్య జిల్లాలో 14,358 మంది వెరసి 33,445 మంది నడవలేని పింఛనుదారులు ఉన్నట్లు గుర్తించింది. అన్నమయ్య జిల్లాలో అంధుల పింఛనుదారులు 2,761, కడప జిల్లాలో 3,627 మంది వెరసి 6,388 మంది ఉన్నట్లు గుర్తించింది. కడప జిల్లాలో చెవిటి పింఛనుదారులు 14,179, మానసిక పింఛనుదారులు 9,505 మంది ఇంటింటికీ వెళ్లి వైద్య బృందాలు పరీక్షించనున్నాయి. మానసిక వైద్యనిర్ధారణ పరీక్షల నిర్వహణకు నెల్లూరు, అనంతపురం, అన్నమయ్య జిల్లాలోని మదనపల్లి ప్రాంతాలకు చెందిన మానసిక వైద్యనిపుణులు పరీక్షించనున్నట్లు తెలుస్తోంది. ఏదేమైనా ఈ నెల 27 నుంచి మే నెలాఖరు నాటికి రీఅసెస్మెంట్ పరీక్షల నిర్వహణ ద్వారా వికలత్వ నిర్ధారణ ఫలితాలను వైద్య ఆరోగ్య శాఖ ప్రభుత్వానికి నివేదించనున్నట్లు తెలుస్తోంది. అనంతరం రాష్ట్ర మంత్రుల బృందం సిఫారసుల మేరకు బెడెడ్ పింఛనుదారులకు వచ్చిన వికలత్వ శాతాన్ని బట్టి పెన్షన్‌లో కోత విధిస్తారా, లేక పెన్షన్ల మొత్తాల్ని రద్దు చేస్తారా అనేది వేచిచూడాల్సి ఉంది.


పుల్లంపేటలో వికలత్వ పింఛనుదారును పరిశీలిస్తున్న సిబ్బంది

గణతంత్ర దినోత్సవ వేడుకలకు సర్వం సిద్ధం

- పోలీసు పరేడ్ మైదానం, కలెక్టరేట్ ముస్తాబు

ప్రజాశక్తి-రాయచోటి

76వ భారత గణతంత్ర దినోత్సవ వేడుకలకు స్థానిక పోలీసు పరేడ్ మైదానం ముస్తాబైంది. ఆదివారం పోలీసు పరేడ్ మైదానంలో 76వ భారత గణతంత్ర దినోత్సవ వేడుకలు అంగరంగ వైభవంగా కనుల పండువుగా ఉదయం 8.45 వేడుకలు ప్రారంభం అవుతాయి. ఉదయం 8:50 గంటలకు జాతీయ పతాకం ఆవిష్కరణ అనంతరం పోలీసుల కవాతు (మార్చ్ ఫాస్ట్), ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల సందేశం, పోలీసు జాగిలాల విన్యాసాలు, జిల్లా ప్రగతిని చాటే శకటాల ప్రదర్శన, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఈ సందర్భంగా విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఉద్యోగులకు ప్రశంసా పత్రాలు అందజేస్తారు. ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలపై వివిధ శాఖలు ఎగ్జిబిషన్ స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. ఈ వేడుకల సందర్భంగా శనివారం సాయంత్రం జిల్లా కలెక్టర్, మున్సిపల్ కార్యాలయం, తహశీల్దార్ కార్యాలయంతో పాటు పలు కార్యాలయాలను కూడా రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరణ చేశారు. గణతంత్ర దినోత్సవ వేడుకలలో పాల్గొనే అధికారులు, సిబ్బంది సమన్వయంతో వేడుకలను విజయవంతం చేయాలని అధికారులు కోరారు.

వేడుకులను విజయవంతం చేయాలి : 76 గణతంత్ర దినోత్సవ వేడుకలలో పాల్గొనే అధికారులు, సిబ్బంది సమన్వయంతో వేడుకలను విజయవంతం చేయాలని అధికారులకు కలెక్టర్ శ్రీధర్ చామకూరి సూచించారు. ఈ వేడుకలకు, జాతీయ పతాకావిష్కరణకు ప్రతి ఒక్కరూ హాజరు కావాలని కోరారు.


విద్యుత్ కాంతుల్లో విరాజిల్లుతున్న కలెక్టరేట్


గణతంత్ర వేడుకలకు ముస్తాబైన పోలీసు పరేడ్ గ్రౌండ్

వేగం కన్నా..ప్రాణం మిన్న

- జాయింట్ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ బి.కృష్ణవేణి

ప్రజాశక్తి-రాయచోటి

వేగం కన్నా..ప్రాణం మిన్న అని, వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని జాయింట్ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ బి.కృష్ణవేణి అన్నారు. శనివారం రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా పట్టణంలోని శ్రీ సాయి ఇంజినీరింగ్ కళాశాలలో రహదారి భద్రత ప్రచారం అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జెటిసి కృష్ణవేణి, విశిష్ట అతిథిగా డిటిఒ కె.ప్రసాద్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కృష్ణవేణి మాట్లాడుతూ వేగం కన్నా ప్రాణం విలువైనదని తెలిపారు. ద్విచక్ర వాహనంపై పరిమిత సంఖ్యలో ప్రయాణిస్తూ ప్రతి ఒక్కరూ హెల్మెట్‌ను తప్పనిసరిగా ధరించాలన్నారు. ప్రయాణ సమయంలో సెల్ ఫోన్‌లో సంభాషించకుండా వాహనాలను నడపాలని సూచించారు. మద్యం, డ్రగ్స్ సేవించి వాహనాలను అధిక వేగంతో నడపరాదని చెప్పారు. పరిమితికి మించి వాహనాలలో ప్రయాణించరాదని సూచించారు. జిల్లా రవాణా అధికారి ప్రసాద్ మాట్లాడుతూ వాహనాలను ప్రయాణిస్తున్నప్పుడు రహదారి భద్రతా సూచనలను తప్పనిసరిగా పాటించాలని, రోడ్డు ప్రమాదాలకు గురైన వ్యక్తులను సరైన సమయంలో బాధితులను ఆసుపత్రికి చేర్చాలని పేరొఒకన్నారు. ట్రాఫిక్ సిఐ విశ్వనాథ్‌రెడ్డి మాట్లాడుతూ పట్టణంలో ట్రాఫిక్ రూల్స్‌ను పాటించి క్షేమంగా గమ్యస్థానాలను చేరాలని అవగాహన కల్పించారు. శ్రీసాయి ఇంజినీరింగ్ కళాశాల అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ఎం.సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ దేశంలో యువత అధికంగా ద్విచక్ర వాహనాల ప్రమాదాలకు గురై ప్రాణాలు కోల్పోవడం, పాక్షిక లేక పూర్తిగా అంగవైకల్యం పొంది తల్లిదండ్రులకు ఆర్థిక, మానసిక ఇబ్బందులకు గురిచేయడం మంచిది కాదని హితవు చెప్పారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వి.బాలాజీ, పట్టణ ఆర్‌టిఒ కార్యాలయ సిబ్బంది, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. **పీలేరు:** కాలం కన్నా ప్రాణం చాలా విలువైందని, ప్రమాదాల నివారణకు అందరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని జిల్లా రవాణాధికారి కె.ప్రసాద్ తెలిపారు. ఎంవిఐ కార్యాలయంలో వాహనదారులు, వాటి యజమానులకు రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంవిఐ అధికారిణి విజయ కుమారి అధ్యక్షత వహించారు. అనంతరం స్థానిక లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆప్టోమెట్రిస్ట్ ఆనంద్‌రెడ్డి బృందం వాహనదారులకు ఉచిత కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో పీలేరు పట్టణ ఎస్ఐ బాలకృష్ణ, ఆర్‌టిసి డిపో మేనేజర్ బండ్ల కుమార్, అసిస్టెంట్ మేనేజర్ సుబ్బమ్మ, జాతీయ రహదారుల అధికారి ధనలక్ష్మి, లైన్స్ క్లబ్ ప్రతినిధులు ఆనందరెడ్డి, మహేష్ గుప్త, చెంగయ్య శెట్టి, శశిధర్‌రెడ్డి, యోగా మాస్టర్లు డాక్టర్ పివిఎస్ లక్ష్మి, డాక్టర్ సుధాకర్, వీఎస్ఎన్ సిద్ధార్థ విద్యా సంస్థల అధినేత్రి వడ్లమూడి మాధవి, ఇతర వాహనదారులు వాటి యజమానులు, ఎవిఐ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



రాయచోటి : మాట్లాడుతున్న జెటిసి కృష్ణవేణి

ఇసుక మాఫియా.. ఇష్టారాజ్యం


చింతపర్తి బాహుదానదిలో ఇసుకను లోడుతున్న జెసిబి

- రోజుకు వంద ట్రాక్టర్లకుపైగా అక్రమ రవాణా
- ఇంకిపోతున్న భూగర్భజలాలు
- రూ.లక్షలు గడిస్తున్నా.. పట్టని అధికారులు
- లబోదిబోమంటున్న రైతులు, మహిళలు, గ్రామస్తులు

ప్రజాశక్తి-వాల్మీకిపురం

మండలంలో ఇసుక అక్రమ రవాణ రోజు రోజుకు ఊపందుకుంటుంది. పగలు.. రాత్రి అనే తేడా లేకుండా ఇసుకాసురులు మదనపల్లె, బెంగళూరుకు అక్రమంగా ఇసుకను తరలిస్తూ.. రూ.లక్షలు గడిస్తున్నారు. బోగంపల్లి, బాహుదానదిలో ఇసుకను తోడేస్తుండడంతో రోజు రోజుకు భూగర్భజలాలు అడుగంటిపోయి తాగు, సాగు నీటికి తీవ్ర ఇబ్బంది తలెత్తే పరిస్థితి నెలకొంటుందని రైతులు, గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పట్టించుకోవాల్సిన అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవ హరిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు.

మండలంలో ఇసుకాసురల ఇష్టారాజ్యం రోజురోజుకు పెరిగి పోతుంది. పగలు.. రాత్రి అనే తేడా లేకుండా మండలంలోని బోగంపల్లి సమీ పంలో, మంచూరు, మూగలమర్రి, చింతపర్తి బాహుదానదిలోని ఇసుకను అక్ర మంగా మదనపల్లె, బెంగళూరుకు తరలిస్తూ లక్షలు గడిస్తున్నారు. సుమారు 50 నుంచి వంద ట్రాక్టర్లకుపైగా ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారు. ఒక్కో ట్రాక్టర్ రోజుకు మూడు సార్లు మదనపల్లెకు అక్రమంగా ఇసుకను తరలిస్తున్నాయి. భూగర్భజలాలు ఇంకిపోయే ప్రమాదం పొంచిఉంది. త్వరలోనే తాగు, సాగు నీటికి తీవ్ర కష్టాలు ఎదుర్కోవాల్సిన పరిస్థితి మొదలవుతుంది. ఒక పక్క వర్షాలు కూడా సక్రమంగా లేకపోవడం.. పండిన పంటలు చేతికందకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతుంటే.. మరో పక్క ఇసుక అక్రమ రవాణాతో భూగర్భజలాలు అడుగంటిపోయి తాగేందుకు చుక్కనీరు కూడా దొరకని పరిస్థితి నెలకొనే ప్రమాదం ఉందని మహిళలు, గ్రామస్తులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అక్రమ ఇసుక రవాణాను అరికట్టే అధికారులే లేరా అని మండల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సెల్‌ఫోన్ మాట్లాడుతూ ప్రమాదకరంగా డ్రైవింగ్ చేస్తున్నారని, వెనుకల, ముందర వచ్చే వాహనదారులు తీవ్ర బెంబేలెత్తి పోతున్నామని ఆవేదన చెందారు. మండలంలోని వడ్డిపల్లె, జర్రావారిపల్లె, వాల్మీకిపురం, చింతపర్తి, గండబోయనపల్లె, విఠలం, కొత్త మంచూరు, పాత మంచూరు, గంగాదొడ్డి, కూరపర్తి, మూగలమర్రి, ఆరమడకకు చెందిన ట్రాక్టర్లు అధికంగా ఈ అక్రమ రవాణాను సాగిస్తున్నట్లు పలువురు ఆరోపిస్తున్నారు. నిబంధనలు తుంగలోతొక్కి ఇష్టానుసారంగా ఇసుకను అక్రమంగా తరలిస్తూ రూ.లక్షలు గడిస్తున్నారు. వాగులు, వంకలు సైతం వదలకుండా దోచుకుంటున్నారు. పోలీసులు సైతం చూసిచూడనట్లు వ్యవహరిస్తుండడంతో ఇసుకాసురులు మరింత బరితెగించిపోతున్నారు. ఇది ఇలాగే కొనసాగితే కాస్తో కూస్తో ఉన్న తాగునీరు సైతం ఇంకిపోయి త్వరలో తాగేందుకు చుక్కనీరు కూడా దొరకదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి అక్రమ ఇసుక రవాణాను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.


ఇసుకను రహస్యంగా డంపింగ్ చేసిన ఇసుకాసురులు

'హంద్రీ-నీవా కాలువ సామర్థ్యాన్ని పెంచాలి'



సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న సిపిఐ నాయకులు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

హంద్రీ-నీవా కాలువ సామర్థ్యాన్ని పది వేల క్యూసెక్కులకు పెంచి, వ్యవసాయ భూములకు సాగునీరు అందించాలని, కాలువ వెడల్పు పనులు తక్షణమే ప్రారంభించాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జి.ఈశ్వరయ్య అన్నారు. సిపిఐ ఆధ్వర్యంలో శనివారం సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరువు పీడిత ప్రాంతంమైన రాయలసీమ జిల్లాల్లో పంట పొలాలకు నికరసాగు జలాలు తీసుకరావాలని, వ్యవసాయం సజీవంగా బతకాలంటే కనీసం 30 శాతం వ్యవసాయ భూమికి సాగునీరు అందించాలన్నారు. హంద్రీ-నీవా ఎత్తిపోతల పథకం ద్వారా ఉమ్మడి కర్నూలు జిల్లాలో 80 వేలు, అనంతపురం జిల్లాలో రెండు దశల కింద 3.45 లక్షలు, కడప జిల్లాలో 37,500, చిత్తూరు జిల్లాలో 1.40 లక్షల ఎకరాల ఆయకట్టుకు నీరు ఇవ్వాల్సి ఉందని పేర్కొన్నారు. ప్రస్తుత కాలువ సామర్థ్యం అందుకు అనుగుణంగా లేదన్నారు. వరద కాలంలో ఎక్కువ నీటిని తీసుకోవడానికి వీలుగా పదివేల క్యూసెక్కుల సామర్థ్యానికి పెంచుతామని 2019లో అనంతపురం జిల్లా పామిడి బహిరంగసభలో ముఖ్యమంత్రి హోదాలో నారా చంద్రబాబు నాయుడు ప్రకటించారని తెలిపారు. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం హంద్రీ-నీవా కాలువ గురించి పట్టించుకోలేదని తెలిపారు. కాలువ వెడల్పు కోసం రైతులు, రైతు సంఘాలు, రాజకీయ పార్టీలు చేసిన ఆందోళనల తర్వాత 2021, జూన్ 7న జిఒ నెంబర్ 29 విడుదల చేసిందన్నారు. దీని ప్రకారం 6,300 సామర్థ్యంతో కాలువ నిర్మాణం చేపడుతామని, అందుకు రూ.6,182 కోట్లు ఖర్చు అవుతాయని అంచనా వేశారన్నారు. నిధులు విడుదల చేయకపోవడంతో పనులు జరగలేదని ఆరోపించారు. రాయలసీమ జిల్లాలకు హంద్రీ-నీవా ప్రాజెక్టు ద్వారా దాదాపు 6 లక్షలకు పైగా ఎకరాల ఆయకట్టుకు నీరు ఇవ్వాల్సి ఉందన్నారు. మదనపల్లి ప్రజల తాగునీరు కోసం చిప్పిలి సమ్మర్ స్టోరేజీని ఏర్పాటు చేశారని, రెండు దశాబ్దాలకు పైన గడుస్తున్నా కేవలం మరువ పనులు పూర్తి చేయలేని పరిస్థితిలో పాలకులు ఉన్నారని, కేవలం రూ.15 కోట్లు ఖర్చు చేస్తే సమ్మర్ స్టోరేజ్ పనులు పూర్తి చేసింటే మదనపల్లి ప్రజలకు తాగునీరు అందేవన్నారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శివారెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు కృష్ణప్ప, సాంబశివ, నియోజకవర్గ కార్యదర్శి కె.మురళి, కార్యవర్గ సభ్యులు తిరుమల, మాధవ్, సూరి, రెడ్డి పాల్గొన్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

బెంగుళూరు వైదేహి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు రాయల్ యూత్ సొసైటీ అధ్యక్షులు రేగడి ప్రసాద్ కుమార్ తెలిపారు. శనివారం ఆయన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సభ్యులతో కలసి కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ ఈ వైద్య శిబిరంలో కేన్సర్, గుండె, కిడ్నీ, షుగర్, గ్యాస్ట్రో ఎంట్రాలజీ, న్యూరాలజీ, వ్యాధులతో బాధపడుతున్నవారు వైద్య నిపుణులచే చికిత్సలు పొందవచ్చునన్నారు. మదనపల్లి పట్టణం స్థానిక ఆర్‌టిసి బస్టాండ్ సమీపంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం వరకు ఉచిత వైద్య శిబిరం కొనసాగుతుందని తెలిపారు. ఈ శిబిరంలో పరీక్షలు చేయించుకున్న వారికి ఎన్టీఆర్ వైద్య సేవ స్కీం ద్వారా ఉచితంగా శస్త్ర శిక్షలు చేయబడునని వివరించారు. ఈ సదావకాశాన్ని సమాజంలోని అన్ని వర్గాల ప్రజలు, ఉద్యోగులు, కార్మికులు, వయోవృద్ధులు, యువత, మహిళలు, రైతులు, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రాయల్ యూత్ సొసైటీ, రాయల్ మహిళా వెల్ఫేర్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో జరిగే ఉచిత వైద్య శిబిరంలో అందరికీ ఆరోగ్యం అందించడమే తమ ఏకైక లక్ష్యమని పేర్కొన్నారు. కార్యక్రమంలో సుంకర రామచంద్ర, సాతిరి నాగరాణి, సౌజన్య, వరప్రసాద్, నళిని, దాకరాజు, దివ్యశ్రీ, గుర్నాజ్ పాల్గొన్నారు.

వృద్ధులు, చిన్నారులకు ఉచిత వైద్య పరీక్షలు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

అమ్మచెరువుమిట్టలోని వెలుగు సంస్థలో పట్టణంలోని శ్రీహిత ఆస్పత్రి వారి సౌజన్యంతో ఆయుర్వేదిక్ ఉచిత మెడికల్ క్యాంపును మదనపల్లి వాసవి క్లబ్ ప్రెసిడెంట్ పొన్నగంటి అమరనాథ్, వనిత క్లబ్ ప్రెసిడెంట్ ఎం.శ్వేత ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. డాక్టర్ రూపేష్, డాక్టర్ బి.మునీశ్వరి దివ్యాంగులు, విద్యార్థులు, వృద్ధులకు డయాబెటిక్, బిపి పరీక్షలతో పాటు సుమారు 300 మందికి వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి నెలకు సరిపడా మందులను ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా వాసవి క్లబ్ ప్రెసిడెంట్ అమరనాథ్, వనిత క్లబ్స్ ప్రెసిడెంట్ శ్వేతా మాట్లాడుతూ పేదలకు సేవా కార్యక్రమాలు నిర్వహించడంలో ఎల్లప్పుడు ముందుంటామన్నారు. రానున్న రోజుల్లో వాసవి, వనిత క్లబ్ సేవా కార్యక్రమాలు విస్తృతం చేస్తామని స్పష్టం చేశారు. అనంతరం వెలుగు సెక్రటరీ ఉదయ్ మోహన్‌రెడ్డిని క్లబ్ సభ్యులు సన్మానించారు. కార్యక్రమంలో జోన్ చైర్‌పర్సన్ ఎ.జ్యోతి, ఎం.నగేష్, బి.కె.అనిల్, చంద్ర, వాసవి క్లబ్ సెక్రటరీ పి.మునిరాజ్, కోశాధికారి కె.కిషోర్ బాబు, వనిత క్లబ్ ప్రెసిడెంట్ ఎం.శ్వేతా, సెక్రటరీ జి.భానురేఖ, ట్రెజరర్ బి.సంధ్య, వాసవి క్లబ్, వనిత క్లబ్ మెంబర్స్ హాజరయ్యారు.



ఉదయ్ మోహన్‌రెడ్డిని సన్మానిస్తున్న క్లబ్ సభ్యులు

అబ్దుల్ ఖాదర్‌కు డాక్టరేట్



ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

హైదరాబాదులోని ఫ్రెండ్షిప్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో ఇంద్ర బుక్ ఆఫ్ రికార్డ్స్ వారి ఆధ్వర్యంలో శనివారం రాజంపేట విభిన్న ప్రతిభావంతుల సంఘం అధ్యక్షులు షేక్ అబ్దుల్ ఖాదర్ డాక్టరేట్ అందుకున్నారు. ఈ సందర్భంగా అబ్దుల్ ఖాదర్ మాట్లాడుతూ 20 సంవత్సరాలుగా చేసిన సేవలకు గాను తెలంగాణ రాష్ట్రంలోని ఫ్రెండ్షిప్ మినిస్ట్రీస్ వారు ఈ అవార్డును అందజేశారని తెలిపారు. ఈ అవార్డు రావడం వలన తనపై మరింత బాధ్యత పెరిగిందని, రాబోయే రోజుల్లో ఇంకా ఎన్నో సేవా కార్యక్రమాలు చేయడానికి ప్రోత్సాహాన్ని ఇచ్చిందని తెలిపారు.

మొక్కుబడే!

ప్రజాదృష్టి

జిల్లాలో స్వర్ణాంధ్ర... స్వచ్ఛ దివస్ ప్రచారార్భటాన్ని తలపించింది. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇటీవలి మైదుకూరు పర్యటనలో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని ఘనంగా ప్రారంభించిన సంగతి తెలిసిందే. రాష్ట్రంలోని మొదటగా ప్రారంభించిన కడప జిల్లాలో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమం ప్రభావం గణనీయంగా కనిపించాలి. జిల్లా వ్యాప్తంగా అటువంటి ప్రభావం కనిపించడం లేదు ఎందుకని, అంటే స్వచ్ఛాంధ్ర కార్యక్రమ ఉద్దేశం మంచిదే. ఆచరణే అధ్వానం అని గమనించాలి. స్వచ్ఛాంధ్ర కార్యక్రమ నిర్వహణకు తగిన యంత్రాంగం ఏర్పాటు, నిధుల కేటాయింపు, ప్రతి రోజూ స్వచ్ఛత కార్యక్రమం మానిటరింగ్ కొరవడిన ఫలితమే మొక్కు బడితనానికి నిదర్శనమని భావించాలి. స్థానిక సంస్థలను బాధ్యులుగా చేసి చేతులు దులుపుకుంటే ఆశించిన ప్రయోజనం నెరవేరదనే సంగతిని గ్రహించాలి. సాధారణంగా పంచాయతీరాజ్ వ్యవస్థలో చివరి అంచెలైన కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, పంచాయతీ ల్లో విధులు నిర్వహించే పారిశుధ్య కార్మికులతోనే స్వచ్ఛాంధ్ర కార్యక్రమానికి బాధ్యులుగా చేయడం ద్వారా ఆశించిన ఫలితాలను సాధించలేమనే సంగతిని గ్రహించాలి. మానవునిలోని శరీరం, మెదడు, మనసు, ఇళ్లు, పనిప్రదేశాల్లో శుభ్రత పాటించడం వంటి సూత్రాలను వల్లించడం వరకు బాగానే ఉంటుంది. వాటిని అమలు చేయడానికి పకడ్బందీ ప్రణాళికను అమలు పరచాల్సి ఉంది. ప్రపంచంలోనే ఎక్కువ జనసాంద్రత, ఎక్కువ నిరక్షరాస్యత కలిగిన దేశంలో పంచ సూత్రాలను అమలు చేయడం, అద్భుత ఫలితాలను సాధించడం ఆషామాషీ వ్యవహారం కాదనే సంగతిని గ్రహించాలి. ఇటువంటి కార్యక్రమాలను తీసుకోవడం ప్రచారం చేసుకో వడం వరకు పర్వాలేదు. స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని మానవుని జీవనంలో అత్యంత ప్రాధాన్యత కలిగిన అంశంగా భావించే వరకు పటుతర సమర్థ ప్రణాళిక ద్వారా అమలు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని గ్రహించాలి. జపాన్, సింగపూర్ వంటి జనాభా తక్కువ, అక్షారస్యత రేటు ఎక్కువ కలిగిన నాగరిక దేశాల్లోనే సాధ్యం. పేదదేశాల జాబితాలోని ఇండియాలోనూ, ఇందులోనూ లిటరసీ రేటులో అట్టడుగు వరుసలో నిలిచిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అద్భుత ఫలితాలను ఆశించడం అత్యాశే అవుతుందని చెప్పకోవచ్చు. నిధుల కేటాయింపును, చేతలను విస్మ రించడం ద్వారా పరిశుభ్ర, ఆరోగ్యవంతమైన సమాజంగా ఎదగాలని ఆశించొచ్చు. ఆచరణలో ఆశించిన ఫలితాలను సాధించడం ఇప్పట్లో సాధ్యం కాదనే క్షేత్రస్థాయి వాస్తవాల్ని గ్రహించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఆచరణ సాధ్యం కాదని విస్మరించడం తగనిపని. దానికి తగిన ప్రణాళిక, పకడ్బందీ అమలుకు తగిన మానవ వనరులు, నిధులు, నిరంతర పర్యవేక్షణ వంటి సమర్థ యంత్రాంగాలను ఏర్పరచడం ద్వారా సాధించడం సాధ్యమేనని గ్రహించాలి. దీనికి చిత్తశుద్ధి, దృఢసంకల్ప బలంతో కంకణబద్ధులం కావాలి మరి.

- ప్రజాశక్తి - కడప ప్రతినిధి


పాఠశాలలో కోడిగుడ్లను పరిశీలిస్తున్న సామాజిక తనిఖీ బృందం

ఆదర్శ పాఠశాలలో సామాజిక తనిఖీ

ప్రజాశక్తి- కలకడ

ఆదర్శ పాఠశాలలో సామాజిక తనిఖీలు నిర్వహించినట్లు ప్రిన్సిపల్ మలంషావలి తెలిపారు. గత మూడు రోజుల నుంచి కలకడ ఆదర్శ పాఠశాలను సామాజిక తనిఖీ బృందం తనిఖీలు చేస్తోంది. పాఠశాలకు సంబంధించిన రికార్డులు, రిజిస్టర్లు తనిఖీలలో భాగంగా మధ్యాహ్న భోజనానికి సంబంధించిన బియ్యం, చిక్కీలు, రిజిస్టర్లు, ఆఫీస్ రిజిస్టర్లు వ్యాయామ, విద్యా రికార్డులు, భౌతిక శాస్త్రం రికార్డులు, రసాయన శాస్త్రం రికార్డులు, గణిత శాస్త్రంరికార్డులు ల్యాబ్‌లు, మరుగుదొడ్లను పరిశీలించారు. బాలురు, బాలికలను వేర్వేరుగా సమావేశ పరిచి విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల తల్లిదండ్రులను సమావేశపరిచి వారి నుంచి సలహాలు, సూచనలు స్వీకరించారు. కార్యక్రమంలో పాఠశాల కమిటీ చైర్మన్ రమేష్‌నాయుడు, ప్రిన్సిపల్‌మలాంషావలి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నరసారెడ్డికి డాక్టరేట్ ప్రదానం

ప్రజాశక్తి-పుల్లంపేట


డాక్టరేట్ పట్టా అందుకుంటున్న సుబ్బనరసారెడ్డి

పుల్లంపేట మండల విభిన్న ప్రతిభావంతుల సమైక్య సేవా సంఘం అధ్యక్షుడు మల్లు సుబ్బనరసారెడ్డికి శనివారం హైదరాబాదులో ఫ్రెండ్‌షిప్ మినిస్ట్రీస్ నటుడు మాణిక్య ఫ్రెండ్స్ మినిస్ట్రీస్ ఫౌండర్ డాక్టర్ ఆలూరి విల్సన్ చేతుల మీదుగా డాక్టరేట్ ప్రదానం చేయడం జరిగింది. గత 13 సంవ త్సరముల నుంచి సంఘం ద్వారా చేసిన సేవలకు గాను డాక్టరేట్ ప్రదానం చేసినట్లు పేర్కొన్నారు.

పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి-కలకడ

పశు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఎడిఎ కృష్ణయ్య పేర్కొన్నారు. మండ లంలోని అన్ని గ్రామ పంచాయతీలలో ఈనెల 20 నుంచి జరుగుతున్న పశువైద్య శిబిరాలలో రైతులు తమ పశువులను శిబిరాల వద్దకు తీసుకువచ్చి వైద్య సేవలు పొందాలని సూచించారు. పశువులకు నట్టల నివారణ, బోటెక్స్ స్ప్రే డిటెక్టింగ్ టీకాలు వేసినట్లు తెలిపారు. బొజ్జ గుంటపల్లి, రాతిగుంటపల్లి, ఎర్రకోటపల్లి పంచాయతీలలో వైద్య శిబిరాలు నిర్వహించినట్లు తెలిపారు. వైద్య శిబిరంలో పాపి రెడ్డి గారిపల్లి, నడిమి చర్ల పశు వైద్యాధికారులు తేజ కళ్యాణ్, పూర్ణిమ, రైతులు పాల్గొన్నారు. **గాలివీడు:** మండలంలోని గుండ్లచేరువు పంచాయితీ దుగ్గన వాండ్లపల్లిలో పశు వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. గొర్రెలు,మేకలు, దూడల కు నట్టల నివారణ పశు వైద్యాధికారి భాస్కర్ ఆధ్వర్యంలో మందులు తాపించారు. అవులకు యద సూదులు, సూటి పరీక్షలు, గర్భకోశవ్యాధులకు చికిత్స లు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో పాడి రైతులు, గొర్రెల కాపరులు పాల్గొన్నారు.

విషపూరిత మేత తిని ఆరు గొర్రెలు మృతి

ప్రజాశక్తి-రామసముద్రం


మృతి చెందిన గొర్రెలు

వ్యవసాయ పొలంలోని విషపూరిత మొక్కజొన్న కర్రలు తిని ఆరు గొర్రెలు మృతి చెందిన ఘటన శనివారం మండలంలోని చొక్కాం డ్లపల్లి పంచాయతి పురాండ్లపల్లెలో చోటు చేసుకుంది. బాధిత రైతు రత్నప్ప వివరాలమేరకు.. రత్నప్పకు 70 గొర్రెలు ఉన్నాయి .వీటిని ప్రతి రోజు గ్రామ సమీపంలోని బీడు భూముల్లో మేతకు వదిలేవాడు. శనివారం తమ గ్రామానికి చెందిన నారాయణ పొలంలో వెన్నులు తీసేసిన మొక్కజొన్న చెనులో తన గొర్రెలను మేతకు వదిలారు. మేత మేసిన కొద్దిసేపటికే గొర్రెలు ఒక్కటొక్కటిగా అస్వస్థతకు గురయ్యాయి. గమనించిన ఆయన వెంటనే పశు వైద్యులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న వైద్యులు గొర్రెలకు వైద్య పరీక్షలు నిర్వహింస్తుండగనే ఆరు గొర్రెలు మృతి చెందాయి. కొన్నిగొర్రెలు అస్వస్థతలో ఉన్నాయని వైద్యులు చెబుతున్నారని రత్నప్ప తెలిపారు. కుటుంబ పోషణకు ఆసరాగా ఉన్న గొర్రెలు ఆకస్మిక మృతి పట్ల రైతు రత్నప్ప కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. ప్రభుత్వం మృతి చెందిన గొర్రెలకు నష్ట పరిహారం అందించాలని కోరుతున్నారు.

ప్రజా స్వామ్యంలో ఓటే వజ్రాయుధం



ఓటు హక్కుపై ప్రతిజ్ఞ చేస్తున్న మదనపల్లి సబ్ కలెక్టర్ మేఘస్వరూప్

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ప్రజాస్వామ్యంలో ఓటుహక్కు ఎంతో విలువైనదని మదనపల్లి సబ్ కలెక్టర్ మేఘస్వరూప్ పేర్కొన్నారు. జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకుని బిటి కళాశాల విద్యార్థులచే సబ్ కలెక్టర్ కార్యాలయం నుంచి ర్యాలీ నిర్వహించి, అనంతరం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కును నమోదు చేసుకోవచ్చునన్నారు. భారత రాజ్యాంగం ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించాలనే ఉద్దేశంతో ఓటు హక్కు నమోదుకు ప్రత్యేక ఆర్టికల్ రూపొందించిందన్నారు. దేశంలోని పౌరులకు ఓటుహక్కు ఓ ఆయుధమని, ఇంకా ఓటుహక్కు నమోదు చేసుకోని వారు ఆయా పరిధిలోని బిఎల్‌ఒలు, గ్రామ, వార్డు సచివాలయాలల్లో నమోదు చేసుకోవచ్చన న్నారు. కార్యక్రమంలో ఆర్.ఐ శేషాద్రి, విఆర్‌ఒలు, రెవెన్యూ సిబ్బంది, సబ్ కలెక్టర్ కార్యాలయపు సిబ్బంది పాల్గొన్నారు. **నిమ్మనపల్లి :** జాతీయ ఓటర్ల దినోత్స వాన్ని తహశీల్దార్ కె.ధనంజయులు ఆధ్వర్యంలో రెవెన్యూ అధికారులు ఘనంగా నిర్వహించారు. ఎస్ఐ తిప్పేస్వామి, ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు రామకృష్ణ, సీనియర్ అసిస్టెంట్ రాంప్రసాద్, సర్పంచ్ పాపులమ్మ మల్లప్ప, మండల అధికారులు, బిఎల్‌ఒలు కలిసి ప్రభుత్వ జూనియర్ కళాశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు, ప్రజలతో స్థానిక రెవెన్యూ కార్యాలయం నుంచి వెంకోజిగారిపల్లి మీదుగా నిమ్మనపల్లి బస్టాండులోని అంబేద్కర్ విగ్రహం వరకు డప్పు వాయిద్యాలతో పెద్ద ఎత్తున అవగాహన ర్యాలీ నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మండలంలోని సీనియర్ ఓటర్లను దుశ్యాలువాతో, పూల మాలతో ఘనంగా సన్మానించారు. నూతనంగా నమోదైన ఓటర్లకు ఓటర్ కార్డును అందజేసి నిజాయితీగా ఓటు హక్కును వినియోగించు కోవాలని తెలిపారు. జూనియర్ కళాశాల, జడ్పీ హైస్కూల్ (తెలుగు) విద్యార్థులతో మానవహారం నిర్వహించి జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని ఉద్దేశించి విస్తృతంగా అవగాహన కల్పించారు. ఓటు హక్కు వినియోగంపై అందరి చేత ప్రతి జ్ఞను చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 18 సంవ త్సరాలు నిండిన ప్రతి ఒక్కరు ఓటరుగా నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసిల్దార్ బాబ్జి, రీ సర్వే డిటి సిరాజుద్దీన్, ఆర్ఐ రాంప్రసాద్, ఎపిఒ రమేష్, ఆర్డబ్ల్యుఎస్ ఇ మిథున్ చక్రవర్తి, విఆర్‌ఒలు, బిఎల్‌ఒలు, రెవెన్యూ పోలీస్ సిబ్బంది, ప్రజలుట పాల్గొన్నారు. **గాలివీడు:** 18 సంవత్సరాలు నిండి యువత భారత రాజ్యాంగం వారి కల్పించిన హక్కును సద్విని చేసుకోవాలని తహశీల్దార్ జె.భాగ్యలత పేర్కొన్నారు. తహశీల్దార్ కార్యాలయం నుంచి గేటు నాలుగు రోడ్ల కూడలి వరకు ర్యాలీగా వచ్చి అక్కడ మానవహారం నిర్వహించి ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఆర్ఐ బాలాజీ ఎన్నికల డేటా ఎంట్రీ ఆపరేటర్ నరేంద్ర విఆర్‌ఒలు రవీంద్రారెడ్డి, శేఖర్, ప్రసన్న, ఏసుదాసు, విఆర్ఎలు అలీఖాన్, కుమార్ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు, పీడీ గంగరాజు, ఆర్ఆర్ కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. **రైల్వేకోడూరు :** మండలంలోజాతీయ ఓటర్ల దినోత్సవం తహశీల్దార్ మహబూబ్‌చాంద్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. తహశీల్దార్ కార్యాలయం వద్ద నుంచి టోల్‌గేట్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. మొదటిసారి ఓటర్ ఐడి కార్డు కలిగిన యువకులను, ఓటు హక్కు కలిగిన సీనియర్ సిటిజనులను ఘనంగా సన్మానించారు. వి.పి.ఆర్ కండ్రిక గ్రామ పంచాయతీలో సీనియర్ సిటిజనులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో విఆర్‌ఒ నరేంద్ర, బిఎల్‌ఒ శివ ప్రజాస్వామ్యంలో ఓటే వజ్రాయుధం. తాసిల్దార్ రామాంజనేయులు. **రామాపురం:** ప్రజాస్వామ్యంలో ఓటే వజ్రాయుధమని తహశీల్దార్ రామాంజనేయులు పేర్కొన్నారు. 15వ జాతీయ ఓటర్ దినోత్సవం సందర్భంగా శనివారం తహసిల్దార్ కార్యాలయం నుంచి మూడు రోడ్లు కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలన్నారు. ఓటు శాతం పెంచేందుకు విభిన్న ప్రతిభావంతులు, మహిళలకు ప్రత్యేక పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. జనవరి, ఏప్రిల్, జూలై, అక్టోబర్ నాటికి 18 సంవత్సరాలు నిండిన వారందరూ ఓటు నమోదు చేసుకోవడానికి ప్రభుత్వం అవకాశం కల్పించిందన్నారు. కార్యక్రమంలో బిట్స్ కళాశాల విద్యార్థులు, బిఎల్‌ఒలు, విఆర్‌ఒలు, పోలింగ సిబ్బంది పాల్గొన్నారు. **వాల్మీకిపురం:** ప్రజాస్వామ్య వ్యవస్థలో 18ఏళ్లు నిండిన ప్రతి పౌరుడు ఓటు నమోదు చేసుకోవడాన్ని సామాజిక బాధ్యతగా గుర్తించాలని స్థానిక తహశీల్దార్ పామిలేటి అన్నారు. శనివారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం నుంచి గాంధీబస్టాండ్ వరకు విద్యార్థులతో కలసి ర్యాలీ నిర్వహించి ఓటుహక్కుపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపిడివో మనోహర రాజు, ఆర్ఐ సుగుణ, రెవెన్యూ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. **బి.కొత్తకోట :** ఆదిత్య డిగ్రీ కళాశాల వారి ఆధ్వర్యంలో స్థానిక తహశీల్దార్ కార్యాలయం నుంచి బైపాస్ రోడ్డు మీదుగా జ్యోతి బస్టాండ్ వరకు కళాశాల విద్యార్థులతో కలిసి అధికారులు ర్యాలీ నిర్వహించారు.అనంతరం జ్యోతి బస్టాండ్ కూడలిలో మానవహారం నిర్వహించి 15వ జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలోని పలువురు వయోవృద్ధులను అధికారులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నగర పంచాయతీ కమిషనర్ జి.వి పల్లవి, మేనేజర్ రమాదేవి, డిటి మహమ్మద్ అన్సారి, ఆదిత్య డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ఎల్.ప్రసాద్, రెవెన్యూ, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు. **పుల్లంపేట :** మం డల కేంద్రంలోని ఎస్‌బివిడి సభ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపల్ అద్దేపల్లి బాలాజీరాజు ఆధ్వర్యంలో కళాశాలలో ఘనంగా ఓటరు దినోత్సవం నిర్వహిం చారు. ఓటు హక్కు ప్రజాస్వామ్య వ్యవస్థ పై విద్యార్థులకు అవగా హన కల్పించేందుకు ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం జరు గుతుందని ప్రిన్సిపల్ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. **తంబళ్లపల్లె :** భారత రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కుతో ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని ఎన్నికల నిర్వహణ అధికారి రాఘవేంద్ర, తహశీల్దార్ హరికుమార్ కోరారు.మండల కేంద్రంలో జాతీయ ఓటర్ల దినోత్సవం అని ఘనంగా నిర్వహించారు. అధికారులు ప్రజాప్రతినిధులు, పలువురు నాయకులు ఉన్నత పాఠశాల విద్యార్థులు నినాదాలు చేస్తూ అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డిటి రవి, ఆఐ ముద్దుకృష్ణ యాదవ్, రెవెన్యూ సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. **పీలేరు:** ఓటు వేయడమన్నది పౌరుల హక్కు ఒకటే కాదని బాధ్యత కూడా అని బవనీస్ రమా, తహశీల్దార్ భీమేశ్వరరావు తెలిపారు.15వ జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా పట్టణంలో ప్రజలకు ఓటు హక్కు వినియోగంపై అవగాహన కల్పిస్తూ ర్యాలీతో పాటు స్థానిక తహశీల్దారు కార్యాలయం వద్ద సమావేశాన్ని నిర్వహించారు.స్థానిక నాలుగు రోడ్ల కూడలిలో ఎన్నికల సంఘం రూపొందించిన ప్రతిజ్ఞను ర్యాలీలో పాల్గొన్న వారితో చేయించారు. తహశీల్దార్ కార్యాలయం వద్ద జరిగిన సమావేశంలో వ్యాసరచన పోటీల్లో విజేతలైన విద్యార్థులకు సీనియర్, జూనియర్ విభాగాల్లో బహుమతులను ప్రదానం చేశారు. చివరగా పీలేరు మండల సీనియర్ ఓటర్లు ఐదుగురిని సన్మానించి సత్కరించారు. కార్యక్రమంలో డిటిలు రెడ్డప్పరెడ్డి, సుబ్ర హ్మణ్యం, ఎఎస్ఒ రామ్మోహన్, టిడిపి నాయకులు అమర్నాథ్ రెడ్డి, ఈ పాఠ శాలల ప్రధానోపాధ్యాయులు, కళాశాల ప్రిన్సిపల్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆగ్రో ఫారెస్ట్రీ ద్వారా అధిక లాభాలు

- కెవికె కో-ఆర్డినేటర్ డాక్టర్ మంజుల

ప్రజాశక్తి-కలికిరి

ఆగ్రో ఫారెస్ట్రీ పద్ధతి ద్వారా రైతులు అధిక లాభాలు లభిస్తాయి కలికిరి కెవికె కో-ఆర్డినేటర్ మంజుల పేర్కొన్నారు. ట్రీస్ అవుట్ సైడ్ ఫారెస్ట్ ఇన్ ఇండియా(టోఫీ) మాస్టర్ ట్రైనర్లకు ఐదు రోజుల ఓరియెంటేషన్ శిక్షణ కార్యక్రమం జనవరి 21 నుంచి 25 వరకు నిర్వహించారు. అగ్రో ఫారెస్ట్రీపై అవగాహన కల్పించడం, అగ్రోఫారెస్ట్రీ పద్ధతులు, ప్రయోజనాల పైన సమగ్ర జ్ఞానాన్ని అందించడం తో పాటు రైతుల పొలాల్లో కలప జాతి చెట్ల పెంపకం ద్వారా దీర్ఘ కాళిక ఆదాయంతో పాటు పర్యావరణాన్ని కాపాడటం ప్రధాన లక్ష్యమని తెలిపారు. మొదటి దశలో అయిదు రోజుల శిక్షణ కార్యక్రమం ఇవ్వడం జరిగిందని, ఈ అయిదు రోజుల్లో నాలుగు రోజులు తరగతుల్లో ఆగ్రోఫారెస్ట్రీ మోడల్స్‌కి సంబంధించిన అవకాశాలు విధానాలు, అనుకూలమైన చెట్ల జాతులు, ట్రాన్సిట్ రూల్స్, కార్బన్ క్రెడిట్స్ వంటి అంశాల పై అవగాహన కల్పించినట్లు తెలిపారు. నర్సరీ, రైతు పొలాలను సందర్శించడం జరిగిందని తెలిపారు. శిక్షణలో హార్టికల్చర్, డిఆర్‌డిఎ ఎన్‌జిఒ ఎఫ్‌పిఒ, రైతులు పాల్గొన్నారు. జిల్లా వ్యాప్తంగా 5 వేల మందికి పైగా రైతులకు శిక్షణ ఇచ్చి వారికి అగ్రోఫారెస్ట్రీ విధానాలను చేరువ చేయడం లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ ఎ.శ్రీనివా సులు టోఫీ స్టేట్ అసోసియేట్ సతీష్, రైతులు పాల్గొన్నారు.


ఉద్యాన తోటలను పరిశీలిస్తున్న కెవికె శాస్త్రవేత్తలు

సకాలంలో నిత్యావసర సరుకులు పంపిణీ

ప్రజాశక్తి-కలకడ

చౌక దుకాణాల్లో నిత్యవసర సరుకులను సకాలంలో పంపిణీ చేయాలని తహశీల్దార్ ఫణికుమార్ డీలర్లను ఆదేశించారు.మండల కేంద్రమైన కలకడ తహశీల్దార్ కార్యాలయంలో శనివారం డీలర్ల సమావేశం నిర్వహించారు. డీలర్లు తమ తమ డీలర్ల షాపులలో నిత్యవసర సరుకులను సకాలంలో పంపిణీ చేసి ఎలాంటి అక్రమాలకు పాల్పడకుండా ప్రజలకు అందుబాటులో ఉండి సరుకులు పంపిణీ చేయాలన్నారు. లబ్ధిదారుల నుంచి ఎలాంటి ఫిర్యాదులు రాకుండా చర్యలు చేపట్టాలన్నారు. నిత్యావసర సరుకులను ప్రభుత్వం కేటాయించిన ధరలకే పంపిణీ చేయాలని ఆదేశించారు .కార్యక్రమంలో మండలం లోని డీలర్లు పాల్గొన్నారు.

క్రికెట్ విజేత అనంతయ్యగారిపల్లి జట్టు

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని అనంతయ్య గారి పల్లి గ్రామంలో సంక్రాంతి పండుగ పురస్కరించుకొని శివారెడ్డి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ విజయ్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి క్రికెట్ పోటీల్లో 28 టీమ్స్ పాల్గొన్నట్లు ఆర్గనైజర్స్ శంకర్ తెలియజేశారు. ఈనెల 9 వ తేదీన ప్రారంభమైన ఈ క్రీడా సంబరాలు శనివారం ఫైనల్ తో ముగిసినట్లు పేర్కొన్నారు. ఫైనల్ మ్యాచ్‌లో అనంతయ్యగారిపల్లి నందలూరు మండలం కుమ్మినిపురం మధ్య హోరాహోరీ మ్యాచ్ జరగగా మొదట బ్యాటింగ్ చేసిన అనంతయ్య గారిపల్లి జట్టు 12 ఓవర్లలో 110 రన్స్ చేయగా తదుపరి కుమ్మినీపురం టీం 11 ఓవర్లలో 90 పరుగులకే ఆల్ అవుట్ అయింది. ఈ హోరాహోరీ మ్యాచ్లో అద్భుత ప్రతిభ కనబరిచిన కడప శ్రీహరి (30 రన్స్, 4 వికెట్స్) క్రీడాకారుడికి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు దక్కింది. విజేతగా నిలిచిన అనంతయ్యగారిపల్లి జట్టుకు మొదటి బహుమతిగా రూ.30వేలు, రన్నర్స్‌గా నిలిచిన నందలూరు మండలం కుమ్మినిపురం జట్టుకి రూ.15వేలు శివారెడ్డి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ విజయ్ కుమార్‌రెడ్డి చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేయడం జరిగింది. గెలుపొందిన విజేతలను అభినందించారు. మరిన్నీ విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ క్రీడా పోటీల్లో ఎటువంటి ఇబ్బంది లేకుండా నిర్వహించిన ఆర్గనైజర్ శంకర్, ప్రతి ఒక్కరికి విజయ్‌కుమాం రెడ్డి ప్రత్యేక అభినందనలు తెలిపారు.


విజేతగా నిలిచిన అనంతయ్యగారిపల్లి జట్టుతో విజయ్‌కుమార్‌రెడ్డి



జాతీయ స్థాయి విజ్ఞానశాస్త్ర ప్రదర్శనకు ఎంపికైన విద్యార్థులు

జాతీయ స్థాయి విజ్ఞాన శాస్త్ర ప్రదర్శనకు..

కలకడ ఆదర్శ పాఠశాల ఎంపిక

ప్రజాశక్తి- కలకడ


జాతీయ స్థాయి విజ్ఞాన శాస్త్ర ప్రదర్శనకు కలకల ఆదర్శ పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ మలంగ్ షా వలి పేర్కొన్నారు. పుదుచ్చేరిలో జరిగిన దక్షిణ భారతదేశ విజ్ఞాన శాస్త్ర ప్రదర్శన లో వివిధ రాష్ట్రాల నుంచి ప్రదర్శనలు ప్రదర్శించారు. ఆంధ్రప్రదేశ్ నుంచి కలకడ ఆదర్శ పాఠశాలకు చెందిన 'బయో ఇంజిన్ అండ్ బయో కెమికల్ క్లీనర్స్' అనే విజ్ఞాన శాస్త్ర ప్రదర్శనను సుమతి కెమిస్ట్రీ ఉపాధ్యాయురాలి పర్యవేక్షణలో విద్యార్థులు బిఎండి సుహేల్, ఎస్ఎండి రేహాన్ ప్రదర్శించారు. దక్షిణ భారతదేశ న్యాయ నిర్ణేతలు కలకడ ఆదర్శ పాఠశాలకు చెందిన ప్రాజెక్టును జాతీయ స్థాయికి ఎంపిక చేసినట్లు తెలిపారు. త్వరలో ఢిల్లీలో జరగబోయే జాతీయస్థాయి విజ్ఞాన శాస్త్ర ప్రదర్శనలో ఈ ప్రాజెక్టు ప్రదర్శింప బడుతుందని తెలిపారు.ఈ ప్రాజెక్ట్ జాతీయ స్థాయికి ఎంపికైనందుకు ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ రమేష్ నాయుడు, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు.


విద్యార్థులు తయారు చేసిన నమూనాలతో విద్యార్థులు

ప్లాస్టిక్ రహిత గణతంత్ర దినోత్సవ వేడుకలకు పిలుపు

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని దలవాయిపల్లి ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు రమణ ప్లాస్టిక్ రహిత గణతంత్ర దినోత్సవ వేడుకలకు పిలుపునిచ్చారు. కలర్ పేపర్స్ ఉపయోగించి ఉపాధ్యాయుడు ఆధ్వర్యంలో విద్యార్థులే స్వయంగా మూడు రంగుల జెండాలు, పాకెట్ బ్యాడ్జీలు, తలకు త్రివర్ణ టోపీలు తయారు చేశారు. అట్ట ముక్కలతో పిల్లలు చేసిన ఎర్రకోట నమూనా, భారతదేశ నమూనా, త్రివర్ణ పతాక పువ్వులు, గ్రీటింగ్ కార్డ్స్ ఎంతగానో ఆకర్షించాయి. అనంతరం రమణ మాట్లాడుతూ ఇప్పుడు వస్తున్న ప్లాస్టిక్ జెండాలు, బ్యాడ్జిస్, వాడకుండా ఇలా పేపర్ తో పిల్లలు చేత తయారు చేయిస్తే వారు సృజనాత్మకంగా ఆలోచించి అనేక నమోనాలు చేయగలరని పేర్కొన్నారు. తమ పాఠశాలలో గణతంత్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా పిల్లలకు వ్యాసరచన, చిత్రలేఖన, వివిధ ఆటల పోటీలు నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేసినట్లు తెలిపారు.



మాట్లాడుతున్న తహశీల్దార్ మహేశ్వరి బాయి

భూ సమస్యలను పరిష్కరించడమే ప్రధాన లక్ష్యం

ప్రజాశక్తి-కలికిరి

రైతుల భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేస్తున్నామని తహశీల్దార్ మహేశ్వరి బాయ్ తెలిపారు. స్థానిక మండల కేంద్రంలో శనివారం ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిడిఒ భానుమూర్తి రావు, ఎంపిపి నూర్జహాన్ ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఎంపిపి, ఎంపిడిఒ ప్రభుత్వ పథకాల ద్వారా జరుగుతున్న పనులపై వివరాలను తెలియ చేయవలసిందిగా కోరారు. తహశీల్దార్ మహేశ్వరి బాయ్ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో రీ సర్వే ద్వారా గ్రామంలో ఉన్న రైతుల భూములపై పొరపాట్లు జరిగాయని వాటిని సరిచేసి రైతులకు భూ సమస్యలు లేకుండా చేయడమే ప్రధాన కర్తవంగా రెవిన్యూ సిబ్బంది పనిచేస్తున్నామని తెలిపారు. రెవెన్యూ సదస్సులలో కలికిరి మండలంలోని 14 పంచాయతీ గ్రామాల నుంచి సుమారు 12 వందలు అర్జీలు వచ్చాయని ఆ అర్జీలను ఆన్‌లైన్ చేసిన తర్వాత 175 మంది రైతులకు వారి భూముల సమస్యను పరిష్కరించామని తెలిపారు. హౌసింగ్ ఎఇ చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వంలో పేద ప్రజలకు ప్రభుత్వం పక్కా గృహాలను మంజూరు చేసినదని ఆర్థిక ఇబ్బందులు ఉన్నవారు తమ పక్క గృహాలను పూర్తి చేయలేకపోయారని అన్నారు. పెండింగ్‌లో ఉన్న గృహాలనుఈ యేడాది మార్చి 31లోపు పూర్తి చేయిస్తామని తెలిపారు. అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు తమ అభివృద్ధి కార్యక్రమాలపై పూర్తి వివరాలను సర్వసభ్య సమావేశంలో తెలియచేశారు .కార్యక్రమంలో సర్పంచులు, ఎంపిటిసిలు, పంచాయతీ కార్యదర్శులు, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.


తాగునీటి బోరు మరమ్మతును పరిశీలిస్తున్న అధికారులు

తాగునీటి బోరుకు మరమ్మతులు

ప్రజాశక్తి-కలకడ

ఎన్‌టిఆర్ సుజల స్రవంతి బోరుకు మరమ్మతులు చేయించినట్లు ఎంపిడిఒ అబ్దుల్ రహీం తెలిపారు. మండల కేంద్రమైన కలకడ సంతలో ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి ఆదేశానుసారం ఎంపిడిఒ, స్థానిక టిడిపి నాయకుల సమక్షంలో బోరుకు మరమ్మతులు చేయించారు. తాగునీటి సరఫరా నిమిత్తం ఎన్‌టిఆర్ సుజల స్రవంతి కోసం ఏర్పాటుచేసిన ప్రాంతానికి నీటిని సరఫరా చేసి తక్కువ ఖర్చుతో ప్రజలకు నీరును అందించేందుకు చొరవ తీసుకునేందుకు ప్రయత్నం చేసినట్లు ఆయన తెలిపారు. 20 లీటర్ల క్యాన్ వాటర్‌ను ప్రజలకు రెండు రూపాయలకే అందించడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు .మహబూబ్‌నగర్ వీధిలో మురికి నీరు రోడ్లపై పోతుండడం గమనించి వాటిని శుభ్రం చేసి బ్లీచింగ్ చల్లించాలని ఎంపిడిఒ సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు జాఫర్‌హుస్సేన్, ఖాజా హుస్సేన్, ఇర్ఫాన్, జిరాక్స్‌అలీ, జిలానీ బాషా, టీఎస్ జవాద్ ఖాన్ పాల్గొన్నారు.